


సినిమా ప్రభావం సమాజంపై ఉంటుందా? ఉండదా? ఈ అంశంపై ఎవరి అభిప్రాయాలు వారివి. వాటిని గౌరవించాల్సిందే. కానీ, నిజమంటూ ఒకటుంటుంది కదా.. దాని గురించి మాట్లాడుకుందాం. కళలు ప్రేరకాలు. కళాకారుల కళారూపాలన్నీ జనాన్ని ప్రభావితం చేయడానికే. స్వాతంత్ర్యోద్యమంలో గానీ మన తెలంగాణ ఉద్యమంలోగానీ ప్రజల్ని ప్రేరేపితం చేయడంలో ప్రజాకళాకారుల పాత్రను, ప్రభావాన్నీ తక్కువ చేసి చూడలేం. ఒక పాట, ఒక కవిత, ఒక కథ, ఒక దృశ్యం.. వీటికి మనసుల్ని కదిలించే, కరిగించే శక్తి ఉంటుందనేది శిలాక్షర సత్యం. ఇక సినిమా విషయానికొస్తే.. సినిమా అనేది సకలకళల సమ్మేళనం. అలాంటప్పుడు సమాజాన్ని ప్రభావితం చేయదని ఎలా చెప్పగలం?

# వెండితెర హుకుం!

**ఎన్టీయార్,** ఎమ్జీయార్ లాంటి సూపర్‌స్టార్లు.. తమ సినిమాల ద్వారా జనానికి ఏదో ఒక మంచి చెప్పడానికి తాపత్రయపడేవారు. మరీ ముఖ్యంగా ఎమ్జీయార్ అయితే సిగరెట్ తాగే సీన్లలో నటించేవారు కాదు. తాను తాగితే, ప్రభావితమై ప్రజలు కూడా తాగేస్తారని భయం ఆయనకు. సినిమా జీవితాల్ని ప్రభావితం చేస్తుందని వారు నమ్మారు.

**'దేవదాసు'కు** ముందు విఫల ప్రేమికుడు బొమ్మలు గీసుకుంటూనో, కవితలు రాసుకుంటూనో, పాటలు పాడుకుంటూనో కనిపించేవాడు. దేవదాసు వచ్చాడూ పద్ధతి మార్చేశాడు. 'మరుపునకు అసలైన మందు మధువే'నని జగత్తుకు చాటాడు. అప్పట్నుంచి మద్యం అమ్మకాలు ఏస్థాయిలో పెరిగాయో అప్పటి గణాంకాలను పరి



శీలిస్తే తెలుస్తుంది. 'దేవదాసు' కళాఖండమే. కాదని ఎవరూ అనరు. అయితే శరత్‌చంద్ర.. పాపం నవల మాత్రమే రాశారు. కానీ మన వేదాంతం రాఘవయ్య ఏకంగా 'దేవదాసు'ని తెరకెక్కించేశాడు. తెరకెక్కిన 'దేవదాసు' ఊరుకున్నాడా!.. బ్రాందీ షాపుల సైన్ బోర్డులపైకి కూడా ఎక్కేశాడు. ఆ గ్లాస్ పట్టుకునే తీరు చూసి మురిసిపోయిన ట్యాక్స్ పేయర్లు.. అదేనండీ మందుబాబులు అప్పట్లో కోకొల్లలంట.

**'మాయాబజార్'లో** కృష్ణుడి గెటప్‌లో ఉన్న ఎన్టీయార్ స్టిల్‌ని క్యాలండర్‌గా వేయించి విడుదల చేశారు నిర్మాతలు నాగిరెడ్డి, చక్రపాణి. అవి ముందు గోడలెక్కాయి. తర్వాత ఏకంగా పూజా మందిరాల్లో తిష్ఠేసుకుని కూర్చున్నాయి. ఎంత ప్రభావితం కాకపోతే అలా జరిగుంటుంది చెప్పండి?

> **ఇక** వాణిశ్రీ చీరలు.. వాణిశ్రీ జాకెట్లు.. వాణిశ్రీ బొట్టుబిళ్లలు.. వాణిశ్రీ హెయిర్ స్టైల్.. వాణిశ్రీ హెయిర్ పిన్స్.. అబ్బో ఇలా చెప్పుకొంటూ పోతే.. పెద్దలిస్టే అవుతుంది. ఆ రోజుల్లో ఆడాళ్లంతా వాణిశ్రీలేనట. చివరకు షోరూమ్స్ బయట షర్మిలా ఠాకూర్ బొమ్మలు పెడితే, వాటిని కూడా వాణిశ్రీ బొమ్మలే అనుకునేవారంట జనం.

> **ముఖానికి** రంగులేసుకునే ఓ నటుడు బయటకొచ్చి రాజకీయపార్టీ పెట్టి ఓటు అడిగితే అతణ్ని ఏకంగా ముఖ్యమంత్రినే చేసేశారు జనం. ఆ ప్రభావంతోనే తర్వాతకాలంలో కొందరు నటులు రాజకీయపార్టీలు పెట్టారు. ఇది ప్రభావితం చేసిన అంశం కాదంటామా?..

**పాత** సినిమాలు, ముఖ్యంగా 60ల్లో సినిమాలు బాగా చూసిన వారికి ఓ విషయం అర్థమై ఉండాలి. అవుట్ డోర్ సన్నివేశాల్లో వెనక ఉన్న జనాలను గమనిస్తే.. చిత్రంగా ఒక్కొక్కరూ ఒక్కో అక్కినేనిలా కనిపిస్తుంటారు. అదే డ్రెస్‌కోడ్, అదే నడక.. అలాగే నిలబడటం. అంతెందుకు? ఎప్పుడైనా ఏఎన్నార్ విమానం దిగుతున్న సన్నివేశం చూడండి.. ఆయనతో ఫ్లైట్ దిగేవాళ్లంతా అక్కినేని స్టైల్‌లోనే కనిపిస్తారు. అప్పట్లో యువతను ఆయన అంతలా ప్రభావితం చేశారన్నమాట. 'ఎదురులేని మనిషి' సినిమా విడుదలైంది. ఆ సినిమా కోసం ఎన్టీయార్ స్టైల్ మార్చారు. బాబీ కాలర్, బెల్‌బాటమ్ ప్యాంట్ ధరించారు. నిజానికి అంతకు ముందే బాలీవుడ్‌లో ఆ స్టైల్ మొదలైనా.. మనవాళ్లకు తెలిసింది మాత్రం 'ఎదురులేని మనిషి' నుంచే. ఆ రోజుల్లో ఎన్టీయార్ స్టైల్ ఫాలో అవ్వని కుర్రాడు లేడు. ఈ స్టైల్‌లో ఎన్టీయార్‌కి బట్టలు కుట్టిన కంపెనీ పేరు 'యాక్స్ టైలర్'. ఆ తర్వాత తెలుగునేలపై ప్రతి ఊళ్లో ఒక 'యాక్స్ టైలర్' వెలిసింది. 'యాక్స్ టైలర్' అంటే అదో బ్రాండ్. ఆ పేరున్న టైలరింగ్ షాపులో బట్టలు కుట్టించుకోవడం ఓ క్రేజ్. ఆ పేరుతో చాలామంది టైలర్లు బతికేశారు.

**'ప్రేమాభిషేకం'** సినిమా ముందు 'క్యాన్సర్ వ్యాధి' అంటే చాలామందికి తెలీదు. ఆ సినిమా వచ్చి చాలామందికి క్యాన్సర్‌పై అవగాహన పెంచింది. దీన్నిబట్టి సినిమాకు అవగాహన పెంచే శక్తి ఉందని నమ్మొచ్చు.

**తెలుగునేలపై** 'రికార్డింగ్ డ్యాన్స్' అనే సంప్రదాయం మొదలవ్వడానికి ప్రభావితం చేసిన అంశాలేంటి? ముఖ్యంగా గోదావరి జిల్లాల్లో చాలామంది కళాకారులకు ఇదే భుక్తి. వాటి పుణ్యమా అని కొన్ని కుటుంబాలు బతికేశాయి. బతుకుతున్నాయి కూడా. ఇది కూడా ప్రభావితం చేసిన అంశమేగా.

> **చిరంజీవి..** అప్పటి యువతరానికి ఆయనే రోల్ మాడల్. చిరంజీవి ప్రేరణగా, హీరో అవుదామని చెన్నయ్ రైళ్లెక్కినవారి సంఖ్య చాంతాడంత. సక్సెస్ అయిన వాళ్లు కూడా చాలామందే ఉన్నారు. చిరంజీవిలా ఫైటింగులు చేయాలని ప్రయత్నించి మోకాళ్లు విరగ్గొట్టుకున్న వాళ్లూ ఉన్నారు. చిరంజీవి ప్రభావం వల్ల గొప్ప డ్యాన్సర్లయిన స్టార్లూ ఉన్నారు.

**'శివ'..** సినిమా విడులైంది. అంతకుముందు తలకు నూనె పెట్టుకుని చక్కగా దువ్వుకునే కుర్రాళ్లు.. తలకు నూనె మానేసి పైకి దువ్వడం మొదలుపెట్టారు. హ్యాండ్‌కఫ్స్ పెట్టుకొని బుద్ధిగా స్కూల్‌కెళ్లిన పిల్లలు.. చొక్కా చేతుల్ని మణికట్టు వరకూ మడవడం మొదలుపెట్టారు. సైకిల్ చైన్‌ని మరోలా ఉపయోగించొచ్చని కూడా 'శివ' సినిమానే అప్పటి కుర్రాళ్లకు నేర్పింది. 'ఉందిగా సెప్టెంబర్ మార్చిపైనా.. వాయిదా పద్ధతుంది దేనికైనా..' అని సిరివెన్నెల పొరపాటున రాసిన నాలుగు లైన్ల వల్ల.. మార్చి పరీక్షలు తప్పి సెప్టెంబర్ రాసినవాళ్లు కోకొల్లలు. 'శివ' పాత్ర ద్వారా రౌడీయిజం 'తప్పు' అని రామ్‌గోపాల్ వర్మ చెప్తే.. దాన్నెవరూ ఫాలో అవ్వలేదు. పైగా భవానీని ఆదర్శంగా తీసుకున్నారు. ఫలితంగా వీధికొక రౌడీ పుట్టుకొచ్చాడు. సెంటర్‌కో గ్రూపు తయారైంది. అప్పట్లో రఘువరన్ ధరించిన స్పన్ షర్ట్స్ బాగా అమ్ముడుపోయేవి. సమాజంపై 'శివ' ప్రభావం అసామాన్యమైనది. 'గీతాంజలి' పుణ్యమా అని ప్రేమికులు పెరిగారు. చిత్రం, నువ్వేకావాలి, 7/జీ బృందావన్ కాలని సినిమాల వల్ల టీనేజ్ ప్రేమలు పెరిగాయి. నేటి యువతపై 'అర్జున్‌రెడ్డి' ప్రభావాన్ని తక్కువ చేసి చూడగలమా? అర్జున్‌రెడ్డి ప్రవర్తన.. ఆ ధిక్కార స్వభావం.. అర్జున్‌రెడ్డి హెయిర్‌స్టైల్.. అర్జున్‌రెడ్డి గడ్డం.. చివరకు అర్జున్‌రెడ్డి పాత్రలోని చెడులక్షణాలు సైతం యువతరాన్ని కట్టిపడేశాయి. దాంతో గల్లీకొక అర్జున్‌రెడ్డి తయారయ్యాడు. అంచేత.. చివరిగా చెప్పొచ్చేదేంటంటే.. మంచి చేదుగా ఉంటుంది. చెడు తీయగా ఉంటుంది. అందుకే చెడు వేగంగా జనాల్లోకెళ్తుంది. కళాత్మక రంగంలో ఉండేవాళ్లు ఈ విషయంపై బాధ్యతగా ఉండాలి. మంచైన చేదుని రుచిగా అందించడానికి ప్రయత్నించాలి. అంతేతప్ప తేలిగ్గా అమ్ముడుపోతున్నదని చెడు రుచిని జనాలకు మరిగిస్తే.. సమాజం మురిగిపోతుంది.. తస్మాత్ జాగ్రత్త!

... బుర్రా నరసింహా

**కొన్నాళ్లుగా** వరుస ఫ్లాప్‌లతో విసిగి వేసారిన బాలీవుడ్ బాద్ షా షారుఖ్ ఇప్పుడు మళ్లీ టాప్‌గేర్‌లో దూసుకుపోతున్నాడు. ఈ ఏడాది 'పఠాన్', 'జవాన్' చిత్రాలు బాక్సాఫీస్ రికార్డులు తిరగరాయడంతో కింగ్ ఖాన్ అభిమానులూ పండుగ చేసుకుంటున్నారు. ఇదే జోరులో ప్రొడ్యూసింగ్ సంస్థ వాచ్‌మోజో షారుఖ్ ఖాన్ నటించిన చిత్రాల్లో టాప్ పది సినిమాల జాబితా విడుదల చేసింది. అందులో 'దిల్‌తో పాగల్ హై' పదో ర్యాంకు దక్కించుకుంది. 'డర్' తొమ్మిది, 'దేవ్‌దాస్' ఎనిమిది, 'పఠాన్' ఏడు, 'జవాన్' ఆరో ర్యాంకింగ్ పొందాయి. 'కభీ ఖుషీ కభీ గమ్' ఐదో ర్యాంకు, 'బాజీగర్' నాలుగు, 'కల్ హో న హో' మూడు, 'కుచ్ కుచ్ హోతా హై' రెండో ర్యాంకులో నిలిచాయి. 'దిల్‌వాలే దుల్హనియా లేజాయేంగే' మొదటి స్థానం దక్కించుకుంది. ఈ ర్యాంకింగ్‌పై కింగ్ ఖాన్ అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే, బాద్ షా నటించిన ఎవర్‌గ్రీన్ హిట్ చిత్రాలు 'వీర్‌జారా', 'మై హూ నా', 'మై నేమ్ ఈజ్ ఖాన్', 'చక్ దే ఇండియా', 'స్వదేశ్' చిత్రాలకు ఈ జాబితాలో చోటు దక్కకపోవడంపై కొందరు పెదవి విరుస్తున్నారు. మరికొందరైతే షారుఖ్ చిత్రాలకు ర్యాంకింగ్స్ వర్తించవంటూ తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు.



# తికమక నవ్వులు

ఓటీటీ హిట్




**పాపం పసివాడు**

**ఆహా:** సెప్టెంబర్ 29

**తారాగణం:** శ్రీరామచంద్ర, రాశీ సింగ్, గాయత్రి చాగంటి, శ్రీవిద్య తదితరులు

**దర్శకత్వం:** లలిత్ కుమార్

ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో క్రైమ్, హారర్ థ్రిల్లర్స్ తర్వాత కామెడీ చూసేందుకే ప్రేక్షకులు అధిక ప్రాధాన్యం ఇస్తారు. అందుకే హాస్య ప్రధానంగా, యూత్‌ను టార్గెట్ చేస్తూ దర్శకుడు లలిత్ కుమార్ చతుర్ముఖ ప్రేమాయణాన్ని 'పాపం పసివాడు'గా ఓటీటీకెక్కించాడు. ఇండియన్ ఐడల్ ఫేమ్ శ్రీరామచంద్ర కథానాయకుడిగా నటించడంతో క్రేజ్ బాగానే వచ్చింది. ఐదు ఎపిసోడ్లు దేనికదే కామెడీని పంచుతాయి. నిడివి తక్కువగా ఉండటంతో బోర్ రాదు. అక్కడక్కడా ట్రాక్ తప్పినట్టు అనిపించినా కథనంలో వేగం ఆకట్టుకుంటుంది. ఇంతకీ ఈ పసివాడి కథ ఏంటంటే.. క్రాంతి (శ్రీరామచంద్ర), డింపీ (గాయత్రి) ప్రేమికులు. వీళ్ల లవ్‌ట్రాక్ ఆరేండ్లుగా సాగుతుంటుంది. ఓ రోజు డింపీ దగ్గర పెండ్లి ప్రస్తావన తెస్తాడు క్రాంతి. అందుకు ఆమె నో చెబుతుంది. దాంతో అతను మద్యానికి బానిసై డిప్రెషన్‌లోకి వెళ్లిపోతాడు. మరోవైపు పెండ్లి చేసుకోమని క్రాంతి తల్లి అతణ్ని ఒత్తిడి చేస్తుంటుంది. వీటన్నిటికీ దూరంగా ఉండాలని క్రాంతి స్నేహితుల దగ్గరికి వెళ్లిపోతాడు. క్రాంతి అనుకోకుండా ఒకరోజు ఓ పార్టీలో చారు (రాశీసింగ్)ను కలుస్తాడు. ఆమె ప్రేమలో పడతాడు. కానీ, చారు ఎక్కడుందీ కనుక్కోలేకపోతాడు. చివరికి తల్లి మాట కాదనలేక అనూష (శ్రీవిద్య)తో పెండ్లికి ఒప్పుకొంటాడు. వాళ్ల నిశ్చితార్థం జరుగుతుండగా చారు అక్కడికి వస్తుంది. ఆ తర్వాత ఏమైంది? క్రాంతి పెండ్లి ఎవరితో జరిగిందన్నది మిగతా కథ.

'మాయ' సినిమాతో టాలీవుడ్‌లోకి ఓ అనుకోని అతిథి వచ్చింది. వచ్చినావిడ ఊరికే ఉందా అంటే.. తన అందంతో ప్రేక్షకుల మతులు గతి తప్పేలా చేసింది. అభినయంతో అందరి హృదయాలనూ కొల్లగొట్టింది. తాజాగా డిస్నీ-హాట్‌స్టార్‌లో 'అతిథి' వెబ్ సిరీస్‌లో 'మాయ'గా కాసేపు కవ్వించింది, మరికాసేపు భయపెట్టింది, మొత్తంగా అదరగొట్టింది. ఇంతకీ ఈ మాయా అతిథి ఎవరో చెప్పలేదు కదూ! ఆమె పేరు అవంతిక మిశ్రా. తనను పలకరించగానే 'మీకు మాత్రమే చెప్తా'నంటూ 'జిందగీ'తో ఎన్నో సంగతులు పంచుకుంది. ఆ ముచ్చట్లు ఆమె మాటల్లోనే...



# నా జర్నీ మొదలైంది ఇప్పుడే..

**చాలామంది** కాలక్షేపానికి సినిమాలు చూస్తారు. నా తరహా వేరు. సినిమాను స్కూల్‌లో పాఠంగా భావించేదాన్ని. అలా నటనపై మోజు పెంచుకున్నా! కెమికల్ ఇంజినీరింగ్ చదివిన నేను యాక్సిడెంటల్‌గా సినిమాల్లోకి రాలేదు. యాక్టింగ్‌ను కెరీర్‌గా మలుచుకోవాలని చదువుకునే రోజుల్లోనే ఫిక్సయ్యాను! నా అభిరుచి తెలిసి మా అమ్మానాన్న ఓకే అన్నారు. 'ఇండస్ట్రీలో మనకంటూ ఎవరూ తెలియదు. స్వశక్తిని నమ్ముకో. మా అండదండలు నీకు ఎప్పుడూ ఉంటాయి' అన్నారు. ఇప్పుడే కాదు, చిన్నప్పటి నుంచీ నా అభిప్రాయాలకు విలువ ఇచ్చేవారు. మా నాన్న ఎమ్‌కే మిశ్రా ఎయిర్ ఫోర్స్ అధికారి. రిటైర్ అయ్యాక లాయర్‌గా పనిచేస్తున్నారు. అమ్మ సవిత గృహిణి. నాకు ఒక తమ్ముడు ఉన్నాడు.

## రెండేండ్లకో ఊరు

నా బాల్యం ఓ సినిమా కథలా సాగింది. సినిమాల్లో సీన్ సీన్‌కూ లొకేషన్లు మారుతాయి కదా! అలాగన్నమాట!! ఉద్యోగ రీత్యా మా నాన్న రెండేండ్లకో ఊరు మారాల్సి వచ్చేది. దాంతో నా బాల్యం ఎనిమిది నగరాల్లో సాగింది. రెండేండ్లకో ఊరు మారడం వల్ల నాకు అన్ని ప్రదేశాల గురించి తెలిసింది. అక్కడి పద్ధతులు, సంప్రదాయాలపై అవగాహన ఏర్పడింది. రకరకాల భావాలు కలిగిన వ్యక్తులతో పరిచయం వల్ల వయసుకు మించిన పరిణతి కనబరచేదాన్ని. ఏదైనా తొందరగా స్వీకరించే మనస్తత్వం పెరగడానికీ ఇదే కారణం. ఇప్పుడు కూడా ఎక్కడికి వెళ్లినా.. అక్కడివాళ్లు నా వాళ్లే అన్న భావన త్వరగా కలుగుతుంది. నన్ను కూడా వాళ్లు అంతే త్వరగా యాక్సెప్ట్ చేస్తుంటారు. సినిమాల్లోనూ అదే కొనసాగుతున్నది.

## పాకెట్ మనీ కోసం..

స్కూల్ డేస్‌లో ఆటల్లో చాలా చురుగ్గా ఉండేదాన్ని. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ పాల్గొని పతకాలు సాధించాను. ఫిట్‌నెస్ విషయంలో అస్సలు కాంప్రమైజ్ అయ్యేదాన్ని కాదు. పెద్దయ్యాక మెల్లగా మాడలింగ్ చేయడం మొదలుపెట్టా. పాకెట్ మనీ కోసం యాడ్స్‌లో నటించేదాన్ని. అయితే నా స్నేహితులు, యాడ్ మేకర్స్ 'నీది కమర్షియల్ ఫేస్‌కట్. సినిమాల్లోకి వెళ్తే బాగుంటుంది' అనేవాళ్లు. ఆ మాట విన్నప్పుడల్లా నాకూ హ్యాపీగా అనిపించేది. అయితే, సినిమా అవకాశాల కోసం ఎలా ప్రయత్నించాలో కూడా పూర్తిగా తెలిసేది కాదు. ఇలా ఉండగానే అనుకోకుండా డైరెక్టర్ నీలకంఠ సార్ ద్వారా మొదటి అవకాశం వచ్చింది. ఏదో యాడ్ చూసి సంప్రదించారు. ఆడిషన్ కోసం హైదరాబాద్ వచ్చా! అంతకుముందు ఎప్పుడో ఒకసారి బ్యాడ్మింటన్ పోటీల కోసం ఇక్కడికి వచ్చా! హైదరాబాద్ ఎంతో మారిపోయింది అనిపించింది. ఆడిషన్ కేవలం నిమిషాల్లోనే ఓకే అయింది. అలా వినూత్న దర్శకుడిగా పేరున్న నీలకంఠ చిత్రం 'మాయా' ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యా!

## పని చేస్తూనే..

'మాయా' సినిమా ఫలితం ఎలా ఉన్నా.. నటిగా నాకు మంచిపేరు తెచ్చింది. బిగ్‌స్క్రీన్ మీద నన్ను నేను చూసుకున్నప్పుడు ఆనందంతో కన్నీళ్లు వచ్చేశాయి. తర్వాత వరుస అవకాశాలు వచ్చాయి. అయితే అప్పటికింకా ఇంజినీరింగ్ పూర్తి కాకపోవడంతో.. దేన్నీ ఒప్పుకోలేదు. మళ్లీ రెండేండ్లకు 'మీకు మీరే మాకు మేమే'తో మరోసారి తెలుగువారిని పలకరించా. నటనలో నేను ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నది లేదు. పని చేస్తూనే నేర్చుకున్నా. కెరీర్ ఇప్పుడు స్పీడ్ అందుకుంది. 'అతిథి' వెబ్‌సిరీస్‌లో కొత్తగా కనిపించానని చాలామంది అభినందిస్తున్నారు. ప్రస్తుతం మూడు చిత్రాల్లో నటిస్తున్నా. ఒక వెబ్‌సిరీస్ కూడా స్ట్రీమింగ్‌కు సిద్ధంగా ఉంది. మరోవైపు తమిళంలోనూ మంచి ఆఫర్లు వస్తున్నాయి. పాన్ ఇండియాకు పర్యాయపదంగా మారిన తెలుగు సినీ ఇండస్ట్రీలో నా ప్రయాణం ఇప్పుడే మొదలైంది. నన్ను ఆదరిస్తున్న తెలుగు వారిని సుదీర్ఘకాలం ఎంటర్‌టైన్ చేయాలనుకుంటున్నా! ఈ జర్నీ సక్సెస్ ఫుల్‌గా సాగుతుందన్న నమ్మకం నాకుంది!!

> సినిమాల్లోకి వెళ్తానంటే అమ్మానాన్న నో చెప్పలేదు సరికదా ప్రోత్సహించారు. 'గ్లామర్ ఫీల్డ్‌లో ఉన్నావని కంగారుపడాల్సిన పనిలేదు. అక్కడ ఎవరూ తెలియకపోవచు.. కానీ, నువ్వు ఒక సైనికుడి కూతురువని మర్చిపోకు. ఎలాంటి పరిస్థితులనైనా నువ్వు ఎదుర్కోగలవు' అని అమ్మ ధైర్యం నూరిపోసింది.

Avantika Mishra

